క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఉలిమెల్ల ఏరియా ప్రాంతంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణంలోని 33/11కె.వి ప్రభుత్వాసుపత్రి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కె.వి ఆసుపత్రి ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్ ఎరెక్షన్ ఉన్న సందర్భంగా విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేలకొరిగిన రేకుల షెడ్డు

కమలాపురం : స్థానిక వెలుగు పాత కార్యాలయం వద్ద ఉన్న రేకుల షెడ్డు ఎగిరి పడింది. గురువారం సాయంత్రం కమలాపురం మండలంలో భారీ గాలులు వీచాయి. దీంతో అక్కడక్కడ వృక్షాలు నేల కొరిగాయి. వెలుగు పాత కార్యాలయంకు సంబంధించిన రేకుల షెడ్డు విరిగి పడింది. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగి పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె : లింగాల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. దాతల సహకారంతో ఆలయాన్ని పునరుద్ధరించారు. గురువారం చివరి రోజు కావడంతో విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు మిట్టపల్లె, గంగిరెడ్డిపల్లెల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట కార్యక్రమం భక్తులను అలరించింది. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, నరేంద్రాచార్యులు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ప్రారంభమైన ఉరుసు


జెండాలు ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో వెలసిన సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం అస్థాన ఏ గౌసియా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ ఆధ్వర్యంలో పట్టణంలోని పురవీధుల గుండా జెండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి శిష్యులకు సందేశము చేశారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరులో వెలసిన పురాతన చెన్నకేశవస్వామి దేవాలయంలో గురువారం గ్రామస్తులు కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవంలో కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

పులివెందుల రూరల్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ తప్పదని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని అంబకపల్లె రోడ్డులోని రాచమల్లు ఫంక్షన్‌హాలులో హౌసింగ్ డీఈ రమణారెడ్డి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డీఈని వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు.

రేపు రామాలయంలో వార్షికోత్సవం


శ్రీకోదండరామస్వామి ఆలయం

లింగాల : శ్రీకోదండరామస్వామి ఆలయంలో శనివారం మూడవ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేద పండితులచే శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం కోలాటాలు, రామభజనలు, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను అందుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

‘వేప’ పంటలకు సంజీవిని

- వేప ఆకు, గింజలతో కషాయాల తయారీ
- వేప నూనె పంటలకు ఎంతో మేలు


వేప ఆకు


వేప పిండి

సింహాద్రిపురం : వ్యవసాయంలో వేపకు అధిక ప్రాధాన్యత ఉంది. రైతుల పాలిట నేస్తంగా ఉన్న వేప సంబంధిత మందులను పంటల్లో విరివిగా వాడితే అధిక ప్రయోజనం పొందవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కీటకనాశిని గుణాలు, పంటలకు రోగనిరోధక శక్తిని పెంపొందించే లక్షణాలు వేపలో ఉన్నట్లు పరిశోధనల్లో రుజువైందని, వేప చెట్టు ఉత్పత్తులు అటు వ్యవసాయ, ఇటు ఉద్యాన పంటల్లోనూ, ధాన్యం నిల్వలోనూ వివిధ రూపాల్లో వాడుకోవచ్చునన్నారు. వేసవిలో వేప విత్తనాలను సేకరించుకుంటే వినియోగించుకునేందుకు అనువుగా ఉంటుందంటున్నారు.

వేప ఆకులు

వేప ఆకులు లేదా ఆకులను పొడి చేసి నిల్వ చేసిన ధాన్యంలో కలిపితే పురుగులు పట్టవు. వేపాకుల కషాయంలో ముంచి ఆరబెట్టిన గోనె సంచులకు పురుగులు దరి చేరవు. ఎరువుగా వేపాకులు పొలంలో వేస్తే సేంద్రీయ పదార్థం, పోషకాలతోపాటు నిరోధక శక్తి కలిసి వస్తాయి.

వేప గింజలు

వేప గింజల్లో 0.3 నుంచి 0.6 శాతం ఆజాడిరిక్టిన్ అనే మూల పదార్థం ఉంటుంది. ఇది ఘాటైన చేదు రుచి, వాసన కలిగిస్తుంది. ఈ మందులు వాడిన పంటలకు పురుగులు వాలవు. గుడ్లు పెటే శక్తి తగ్గిపోతుంది. గుడ్లు పెట్టినా లార్వా దశలో రావాల్సిన మార్పులు రాకుండా సంతతి తగ్గిపోతుంది. క్రమేనా పురుగులు నశిస్తాయి. పంటలకు మేలు చేసే సహజ శత్రువులకు ఎలాంటి హాని కలుగజేయవు.

వేప నూనె

వేప నూనె పంటలపై పిచికారీ చేస్తే కాయ తొలుచు, పురుగు రసం పీల్చు పురుగు, ఆకు తినే పురుగుల్ని అదుపు చేయవచ్చు. ఒక లీటరు వేప నూనెకు 200 లీటర్ల నీరు, 200 గ్రాముల సబ్బు పొడి (సర్ఫ్) కలిపి ద్రావణం తయారు చేసుకోవాలి. ఇది ఒక ఎకరాలో పిచికారీ చేయడానికి సరిపోతుంది. నూనె, నీరు కలవదు కనుక ముందుగా సబ్బు పొడి లేదా నీటిలో కలిసే ద్రావణం వేసి బాగా కలిపి నురుగు వచ్చిన తరువాత నీటిలో కలపాలి.

వేప గింజల కషాయం

10 కిలోల వేప గింజల పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి ఒక రోజంతా నానబెట్టాలి. ఈ ద్రావణానికి 2 కిలోల సబ్బుపొడి వేసి బాగా కలియబెట్టిన తరువాత వడగట్టాలి. వచ్చిన కషాయాన్ని పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమ, ఆకు ముడుత పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చు. తొలిదశలో చిన్న గొంగలి పురుగు, కాయ తొలుచు పురుగును అరికట్టే అవకాశం ఉంది. నూనె తీయగా మిగిలిన పిండిని నీటిలో కలిపి ద్రావణం చేసుకోవచ్చు. 10 కిలోల పిండిని 200 లీటర్ల నీటిలో కలిపి ఒక వారం రోజులపాటు నానబెట్టి తర్వాత తేటను వేరుచేసి మొక్కలపై పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

వేప చెక్క(వేప పిండి)

ఇది మేలైన చిక్కటి సేంద్రియ ఎరువు. గింజ నుంచి తీసివేసిన వేప పిండిలో 5.2 శాతం నత్రజని, 11 శాతం భాస్వరం, 1.5 శాతం పొటాష్ ఉంటుంది. ఇది ఎరువుగానే కాకుండా సస్యరక్షణకు ఉపయోగపడుతుంది. వేప పిండి ఎకరాకు 150–200 కిలోలు వాడాలి. కొన్ని బ్యాక్టీరియా తెగుళ్లను నివారిస్తుంది. నులిపురుగులను అదుపులో ఉంచుతుంది. వేప పిండిలో కలిపి యూరియాను వాడితే నత్రజని నెమ్మదిగా తగ్గుతుంది.

వేప రైతు హితకారిణి



వేప చెట్టులోని ప్రతి భాగం వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆకులు, కాయలు, నూనె తదితర ఉత్పత్తుల ద్వారా పైరుకు తెగుళ్లను తట్టుకునే శక్తితోపాటు తెగుళ్ల సోకకుండా చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేప నూనె ఏ పంటపైనా పూత దశలో వినియోగించరాదని, రైతులు వేప వినియోగాన్ని మరింతగా పెంచితే రసాయనిక మందుల వినియోగం బాగా తగ్గించుకోవచ్చు. నాణ్యమైన ఉత్పత్తులను సాధించవచ్చు.

– శివమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, సింహాద్రిపురం

కమలాపురం మెజిస్ట్రేట్‌గా మధుసూదన్‌రావు

కమలాపురం : కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్‌గా ఎస్.మధుసూదన్‌రావు బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన కోర్టు కార్యాలయానికి వచ్చి ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ నుంచి చార్జ్ తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్‌గా వచ్చారు. ఇక్కడ మెజిస్ట్రేట్‌గా ఉన్న లావణ్య పదోన్నతిపై శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిన విషయం విదితమే. మధుసూదన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ కక్షిదారులకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయ సేవలు అందేలా కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా లోక్‌అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించి కేసులు ఎక్కువగా పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, కోపా ట్రేడ్‌లకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీఐ కళాశాలలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఐటీఐ కళాశాలలో కానీ, 9885207231 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

గండి ఆలయ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి


గండి వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట : గండి ఆలయ పనులు త్వరితగతిన పూర్తిచేసి భక్తులకు మూలవిరాట్ దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కావలికృష్ణతేజ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామిలు ఆయనకు పూర్ణకలశంతో స్వాగతించారు. అనంతరం ఆయనచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయన నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కృష్ణతేజ భక్తుల సౌకర్యార్థం గండిలో లక్ష లీటర్ల సామర్థ్యం గల నీళ్ల ట్యాంకును నిర్మించుటకు నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ మాదవీబాలకృష్ణ, బ్రంహానందరెడ్డి, మధు, గోపాల్ నాయక్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా

కార్యకర్తలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భరోసా

కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దు అండగా ఉంటానని కడప ఎంపీ వైఎస్ అవి నాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. గురువారం ఆయన కుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన నాగలగుట్టపల్లెకు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న సురభి గ్రామ సర్పంచ్ రమణమ్మను పరామర్శించారు. అదే గ్రామంలో ఇటీవల కూటమి నేతల చేతిలో గాయపడ్డ వైఎస్ఆర్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు దాసరి రాంబాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కొండవాండ్లపల్లె వద్ద ఎన్‌హెచ్ 440 రోడ్డు వల్ల పలు ఇళ్లకు జరుగుతున్న ఇబ్బందిని పట్టెం ప్రతాప్ ఎంపీకి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి నేతల ఆగడాలకు ఎవరూ భయపడొద్దన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జడ్పీటీసీ శివప్రసాద రెడ్డి, ఎంపీపీ మాదవీబాలకృష్ణ, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ రామాంజులరెడ్డి, సర్పంచులు గంగయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, శ్రీదర్‌రెడ్డి, హరిశేఖర్‌నాయుడు, మండల ఉపా ధ్యక్షుడు గఫూర్, నేతలు జనార్ధనరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, దేవ శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, బ్రంహానందరెడ్డి, నారాయణ, మధుసూదనరెడ్డి, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పులివెందుల ప్రగతిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌పై శీతకన్ను
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల ప్రగతి పనులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. గురువారం పట్టణంలోని భాకరాపురంలో గల వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందులలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రూ.30 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించడం జరిగిందన్నారు. దాన్ని కూడా ఈ ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. ముఖ్యంగా అన్నింటి కంటే బాధాకరమైన విషయం మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైతే.. వచ్చిన సీట్లను ఈ ప్రభుత్వం వెనక్కి పంపడం జరిగిందన్నారు. రూ.350 కోట్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా మెడికల్ కళాశాలను నిర్మిస్తే దానిపై ఈ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి చూపుతోందన్నారు. ఈ సంవత్సర కాలంలో ఈ ప్రభుత్వం మెడికల్ కళాశాలకు చేసిన ఘనకార్యం ఏదైనా ఉందంటే.. మహానుభావుడు డాక్టర్ వైఎస్సార్ పేరును మెడికల్ కళాశాలకు తొలగించడమేనన్నారు. ఈ ప్రాంతానికి ఆరు సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు ఎంపీగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికై దురదృష్టవశాత్తు ఆ మహానుభావుడు మరణిస్తే పులివెందులలోని ప్రభుత్వ కళాశాలకు ఆయన పేరు పెడితే.. ఇప్పుడున్న ప్రభుత్వం ఆయన పేరును తొలగించి రాక్షసానందం పొందుతోందన్నారు. ఆ మహానుభావుడి పేరును మెడికల్ కళాశాల ముఖద్వారం నుంచి తొలగిస్తారేమో కానీ, ఈ ప్రాంత, జిల్లా, రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైఎస్సార్ పేరును తొలగించలేరన్నారు.

వాటర్ గ్రిడ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పులివెందుల ప్రాంతంలో వాటర్ గ్రిడ్ పనులకు సంబంధించి ప్రతి ఇంటికి తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 2021లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులను మొదలు పెట్టడం జరిగిందన్నారు. ఎన్నికల నాటికి 65 శాతం పనులు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 35 శాతం పనులలో ఈ సంవత్సర కాలంలో ప్రస్తుత ప్రభుత్వం ఒక శాతం కూడా చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికే పూర్తయిన 65 శాతం పనులలో కేవలం ట్యాంక్‌కు, పైపునకు కనెక్షన్ ఇచ్చి తాము నీళ్లు తెచ్చినామని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఆ పైపులైన్ కట్టించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించింది వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే.. కేవలం ట్యాంకుకు, పైపులైన్‌కు కనెక్షన్ ఇచ్చే దానికి వీరికి సంవత్సర కాలం పట్టిందన్నారు.

ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తుందో ప్రజలు గమనించాలన్నారు. అధికార పార్టీ నాయకుల ఆలోచన ఎలా ఉందంటే రెండేళ్లు, మూడేళ్లు ఆలస్యం చేసి అరకొర పని చేస్తే వారి హయాంలో పని చేసినట్లుగా ప్రజలు భావిస్తారని ఆలోచిస్తున్నట్లు ఉందన్నారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వారి మోసాలను నమ్మే పరిస్థితి ఉండదన్నారు. వీటన్నింటిని చూస్తే ఈ ప్రాంత అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి


ఈఓ రామసుబ్బారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత పద్మా రాజ్‌కుమార్

వేంపల్లె : వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డిలు కలిసి వేంపల్లె పంచాయతీలో పారిశుధ్య అధ్వానంగా ఉండడంతోపాటు కార్యదర్శిని నియమించాలని కోరారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పంచాయతీ కార్యదర్శిని నియమించాలని పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి లేఖ రాయడం జరిగింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు చిట్వేల్ నుండి వేంపల్లెకు బదిలీ అయిన రామసుబ్బారెడ్డి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతామని పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు.

స్కూటరిస్టుకు గాయాలు

ముద్దనూరు: ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో చెన్నారెడ్డిపల్లె సమీపంలో అదుపు తప్పి స్కూటరిస్టుకు లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలవడంతో 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రైతు బిడ్డకు ‘రవీంద్రనాథ్ ఠాగూర్ లిటరేచర్’ అవార్డు


అవార్డులను చూపుతున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన సామాన్య రైతు అలవలపాటి గంగిరెడ్డి కుమారుడు అలవలపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం విశాఖపట్టణంలోని ప్రెస్‌క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ వారి లైబ్రరీ హాలులో రవీంద్రనాథ్ ఠాగూర్ లిటరేచర్ అవార్డు అందుకున్నారు. నేషనల్ బెస్ట్ రైటర్‌గా ఎంపికై ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఫౌండేషన్ ఆఫ ప్రెస్‌క్లబ్ వెల్ఫేర్ వరల్డ్‌వైడ్ ఫౌండేషన్ జ్యోతి రాణిభాగ్, వైస్ చైర్మన్ ఆఫ్ ఆర్ఎస్‌యూ యూనివర్శిటీ సచితానంద శుక్లాల చే తులమీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. సామాన్య రైతు కుటుంబంలోని వ్యక్తి గంలో ఫుడ్ సైన్స్ న్యూట్రిషియన్‌పై ప్రస్తుతం ఉచిత రచయితగా అవార్డులు అందుకోవడం హర్షించదగ్గ విషయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నవభారతం బుక్‌పై ఈ అవార్డును అందుకోవడం ఆయన ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి శుభపరిణామమన్నారు.

శాంతియుతంగా జీవించండి


మాట్లాడుతున్న సీఐ మహమ్మద్‌రఫీ

కొండాపురం : గ్రామంలో ప్రతి ఒక్కరు శాంతియుతంగా జీవించాలని కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటూరు గ్రామంలో ఆయన కార్డెన్ సెర్చ్ అపరేషన్ నిర్వహించి మాట్లాడారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఇళ్లను క్షుణంగా తనిఖీలు చేశామన్నారు. గ్రామంలో సరైన పత్రాలు లేని 13 బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కుటుంబంలోని తమ పిల్లలను దృష్టిలో పెట్టుకుని ఫ్యాక్షన్ జోలికి వెళ్లవద్దు అన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టం పరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ముద్దనూరు సీఐ దస్తగిరి, ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయ్యండి


17 వార్డులోని ర్యాంపుల వద్ద నిలబడి ఉన్న నీటిని తొలగిస్తున్న కౌన్సిలర్ ఎరికలరెడ్డి

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) : 17వ వార్డులో డ్రైనేజీలు లేక చిన్నపాటి వర్షం పడిన వీధుల్లో వర్షం నీరు నిల్వ ఉండి వార్డు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మా వార్డులో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఆ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి కోరారు. గురువారం వార్డులో ర్యాంప్‌లు వేయడం వల్ల నిల్వ ఉన్న నీటిని ఆయన స్వయంగా చేపట్టారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో ఎప్పుడు అడిగిన నిధులు లేవంటున్నారే కానీ ప్రస్తుతం జరుగుతున్న పనులకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. అధికారులు చొరవ తీసుకుని రాజకీయాలకు అతీతంగా పనులు చేయాలని ఆయన కోరారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిచాలని కోరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డిలు చొరవ తీసుకుని మా వార్డులో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

కార్మిక హక్కులు కాలరాస్తే తిరగబడతాం


కమలాపురంలో క్రాస్ రోడ్డు వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


పులివెందులలో మే డే వేడుకలలో సీఐటీయూ నాయకులు


జమ్మలమడుగులో మేడే సందర్భంగా జెండాను ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం : కార్మిక హక్కులు కాలరాస్తే చికాగో ఉద్యమ స్ఫూర్తితో తిరగబడతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, ఆటో యూనియన్ జిల్లా నాయకుడు రాజేష్ స్పష్టం చేశారు. గురువారం మే డేను పురస్కరించుకుని స్థానిక క్రాస్ రోడ్డు వద్ద సీఐటీయూ జెండాను వారు ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. కార్మిక చట్టాలను కుదించాలని చూస్తే పాలక ప్రభుత్వాలకు పతనం తప్పదన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అసంఘటిత రంగ కార్మికులకు వర్తింప జేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు స్థానిక క్రాస్ రోడ్డు సర్కిల్ వద్ద ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూలులో మే డే దినోత్సవం సందర్భంగా సీఐటీయూ నాయకులు సలీమా, సుధల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి మే డే వేడుకలు జరుపుకున్నారు. కార్మికులు ఉద్యోగులు ఇప్పుడు అనుభవిస్తున్న ఎనిమిది గంటల పని దినం, సెలవులు, పెన్షన్, పీఎఫ్, వైద్య రాయితీలు ఇలా అన్ని కార్మికుల పోరాటం ద్వారానే సాధించుకున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : కార్మికులు చేసే పనికి సమాన వేతనం ఇవ్వాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రెండు పార్టీలకు చెందిన నాయకులు కార్మికులతో మేడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానానికి స్వస్తి పలికి పర్మినెంట్ చేస్తామని నమ్మపలికి కాలయాపన చేయడం తగదన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : హక్కులు, విలువల కోసం పోరాటాలు నిర్వహిస్తుందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి మడగలం ప్రసాద్ తెలిపారు. గురువారం మే డే సందర్భంగా ఇందిరానగర్‌లో రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రమేష్, ఇందిరానగర్ కార్యదర్శి రవి, కార్మికులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : కొండాపురంలో మే డే సందర్భంగా ఏఐటీయూసీ, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులతో ర్యాలీ నిర్వాహించారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎర్రగుంట్ల, ఆర్టీపీపీలలోని పలు కార్మిక సంఘాలు గురువారం ఘనంగా మే డేని జరుపుకున్నాయి. ఎర్రగుంట్లలోని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. అలాగే ఆర్టీపీపీలోని పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయా కార్మిక యూనియన్‌ల కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : కార్మికుల హక్కుల సాధనకోసం పోరాటం చేయాల్సిన అవసరం వుందని, ప్రతి కార్మికుడు మళ్ళీ మేలుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పాతబస్టాండు ఆవరణలో సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేఖంగా, కార్మికుల చట్టాల పరిరక్షణకు ఉద్యమం సాగించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కార్మిక జెండాను భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఎగుర వేశారు. మేడే అమరవీరుల స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతోనే ఈ దేశంలో సమ సమాజ నిర్మాణం జరుగుతుందని అందుకోసం ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.